కిత్తూరు రాణి చన్నమ్మ, సంగొళ్ళిరాయణ చరిత్రపై ఫలపుష్ప ప్రదర్శన

బెంగళూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): లాల్‌బాగ్ ఉద్యానవనంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది వీరరాణి కిత్తూరు రాణి చన్నమ్మ, క్రాంతివీర సంగొళ్ళి రాయణ్ణ చరిత్ర ఆధారంగా ఫలపుష్ప ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రకటించారు. ప్రదర్శనల సందర్భంగా వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇకబాన, జానూర్, థాయ్ ఆర్ట్స్, తోటల అలంకరణ, సాల్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.



కల్యాణం చేస్తే కటకటాలే..!

● బాల్యవివాహాలపై ప్రభుత్వం కఠిన చర్యలు ● తల్లిదండ్రులకే కాదు.. సహకరించిన వారికీ రెండేళ్ల జైలు శిక్ష
● పూజారులు.. బంధువులపైనా కేసులు.. ● ముఖ్యమంత్రి ఆదేశాలతో చట్టసవరణకు కసరత్తు

బెంగళూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది. తల్లిదండ్రులకు, బంధువులకు చివరకు పెళ్లి చేసిన పూజారులకు జైలు శిక్ష వేయనుంది. కర్ణాటక రాష్ట్రం అంటేనే దేశంలోనే అభివృద్ధి చెందుతున్నదిగా పేరుంది. ఓవైపు సిలికాన్ వ్యాలీగా అంతర్జాతీయస్థాయిలో రాష్ట్ర రాజధాని బెంగళూరుకు పేరుంది. ఐటీ, బీటీ, డిఫెన్స్‌తోపాటు విభిన్నరంగాల పరిశ్రమలు సంస్థలు దేశంలోనే అత్యధికం ఉన్నాయి. వీటన్నింటికీ మించి ఉన్నత, సాంకేతిక విద్యా విభాగాలలో దేశానికి ఆదర్శమని దశాబ్దాల కాలంగా గుర్తింపు ఉంది. ఇలా ప్రగతి పరుగులు తీస్తున్నా మరోవైపు బాల్యవివాహాలు ఏటా కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో బాల్య వివాహాలు ఏడాదికి ఆరేడు వందలు కొనసాగడం దేశవ్యాప్తంగా తలదించుకునేలా చేస్తోంది. పోక్సో కేసులు, బాల్య వివాహాలు వంటి దుర్మార్గపు విధానాలను శాశ్వతంగా అరికట్టాల్సిన అవసరం ఉందని భావిస్తోంది.

తల్లిదండ్రూలు శిక్షార్హులే


బాల్యవివాహాలు చేస్తే కేవలం తల్లిదండ్రులకే కాకుండా సహకరించిన వారికి కఠినశిక్షలు విధించేలా చట్టం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సామాజిక దురాగతాల్లో ఒకటైన బాల్యవివాహాలకు ప్రస్తుతం ఉన్న చట్టాలతో సంపూర్ణంగా నియంత్రించడం అసాధ్యమని సీఎం సిద్దరామయ్య ఇటీవల అభిప్రాయపడ్డారు. సీఎం సూచనకు అనుగుణంగా న్యాయ, శాసనసభ వ్యవహారాల శాఖ బాల్య వివాహ నిషేధ బిల్లు 2025ను సిద్ధం చేస్తోంది. స్త్రీ శిశు సంక్షేమశాఖతో చర్చలు జరిపిన తర్వాత బిల్లుకు ఒకరూపు తీసుకురానున్నారు.

కొత్తగా రూపొందించే బిల్లులో మరిన్ని సెక్షన్‌లను పొందుపరచాలని నిర్ణయించారు. బాల్య వివాహ నియంత్రణ చట్టం మరింత కఠినంగా ఉండాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బాల్య వివాహాలకు ముందు నిశ్చితార్థం, వివాహానికి ఏర్పాట్లలో భాగస్వాములైన అందరినీ బాధ్యులను చేయనున్నారు. వధూవరుల కుటుంబీకులతోపాటు సహకరించినవారికి కనీసం రెండేళ్ల జైలుశిక్ష విధించేలా నిబంధనలు పొందుపరుస్తున్నారు. పెళ్ళి శాస్త్రాలు నిర్వహించే పురోహితుడు, పూజారి కూడా చట్టపరిధిలోకి రానున్నారు. లక్ష రూపాయల జరిమానాతోపాటు రెండేళ్ల జైలుశిక్ష విధించనున్నారు.

సిద్ధమవుతున్న బిల్లు

రాజ్యాంగ నిబంధనల ప్రకారం శాసనసభలో బిల్లులను ప్రవేశపెడతారు. ఇప్పటికే కేంద్రప్రభుత్వం అమలులో ఉన్న బాల్య వివాహాల నియంత్రణ చట్టానికి వ్యతిరేకమైన విధానమైతే రాష్ట్రపతి ద్వారా అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ సవరణలు చేస్తున్నందున శాసన సభ ఉభయసభల్లోనే ఆమోదం పొందేలా బిల్లును రూపొందిస్తున్నారు. బాల్య వివాహాలు చేసేవారికి అందుకు సహకరించిన వారికి శాస్త్రాలు చేసేవారు చట్టపరిధిలోకి రానున్నారు. రెండేళ్లు తక్కువ కాకుండా జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానాతోపాటు ఒక్కోసారి రెండింటినీ అమలు చేసేలా రూపొందిస్తున్నారు.

రాష్ట్రంలో 700 బాల్య వివాహాలు



రాష్ట్రంలో 2024-25 ఏడాదిలో 3,489 పోక్సో కేసులు నమోదయ్యాయి. 685 మైనర్లు గర్భం దాల్చారు. సుమారు 700మంది బాల్య వివాహాలు జరిగాయి. అత్యధికంగా శివమొగ్గలో 79, బెళగావిలో 78, చిత్రదుర్గ 74, బాగల్కోటె, 63, మైసూరులో 60మంది మైనర్లు గర్భం దాల్చారు. ఇప్పటివరకు 2,349 బాల్య వివాహాలను నియంత్రించడంలో వివిధశాఖలు సమన్వయంగా పనిచేశాయి. అయినా 700 బాల్య వివాహాలు జరిగినట్టు గుర్తించారు. బాల్య వివాహాలు సామాజిక రుగ్మతగా భావించి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. పల్లె లేదా పట్టణం ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే విద్యావంతులు, స్థానిక స్వచ్ఛంద సంస్థలు అధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. తద్వారా ప్రారంభంలోనే బాల్యవివాహాలను నియంత్రించడం సాధ్యం కానుంది.

నీరాజనం

● బి.సరోజాదేవి కడచూపునకు కదలివచ్చిన అభిమానులు
● అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
● ఆమె పేరుమీద ఓ రోడ్డు: సీఎం



సరోజాదేవి పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): అభినయ సరస్వతి బీ సరోజాదేవికి అభిమానులు, బంధువులు కన్నీటివీడ్కోలు పలికారు. కడచూపు కోసం భారీగా తరలివచ్చారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితర ప్రముఖులు పుష్పాంజలి ఘటించారు. సరోజాదేవి పార్థివదేహాన్ని అభిమానుల సందర్శనకోసం మల్లేశ్వరంలోని ఆమె నివాసం వద్ద ఉంచారు. మంగళవారం ఉదయం సీఎం సిద్దరామయ్య సందర్శించారు. పార్థివదేహంపై పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళి అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అలనాటి మేటి నటిగా సరోజాదేవి గుర్తింపు పొందారని, ఆమె సినిమాలు చూశామని కొనియాడారు. అద్భుతనటనకు సరోజాదేవి పెట్టినపేరు అన్నారు. సీఎం సిద్దరామయ్య సంతాపాన్ని ప్రకటించిన తర్వాత, రోడ్డుకు ఆమె పేరును పెట్టే విషయమై పరిశీలిస్తామన్నారు. ఆమె నివసిస్తున్న ఇంటి రోడ్డుకే పేరు పెట్టాలని ఉందన్నారు. బీబీఎంపీతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. 10 గంటలకు పార్థివదేహాన్ని ప్రత్యేకవాహనంపై ఉంచి మల్లేశ్వరం నుంచి మైసూరురోడ్డు మీదుగా తరలించారు. దారి పొడవునా వివిధ గ్రామాల్లో అభిమానులు నీరాజనాలు పలికారు. కెంగేరి, రామనగర్‌లలో కాసేపు వైకుంఠ రథాన్ని ఆపగా అభిమానులు కడచూపు చూశారు. చన్నపట్టణ తాలూకా దశావర గ్రామానికి పార్థివదేహం చేరుకోగా గ్రామస్థులు, సమీపవాసులు పెద్దఎత్తున తరలివచ్చి నివాళి అర్పించారు. అక్కడ ఒక్కలిగ సంప్రదాయంతో పూలశకటం ఏర్పాటు చేసి అందులో ఊరేగించారు. తోటకు తీసుకెళ్లాక ఆమె పార్థివదేహంపై డీసీఎం డీకే శివకుమార్ పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళులు అర్పించారు. దశావర గ్రామం అంటే బీ సరోజాదేవికి ఎంతో ఇష్టమని స్థానికులు తెలిపారు. స్వగ్రామంలో పేరు ఉండాలనే 4 పాఠశాల గదులను సొంత నిధులతో నిర్మించారన్నారు. అధికార లాంఛనాలలో భాగంగా పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. బీ సరోజాదేవి తల్లి సమాధి పక్కనే అంత్యక్రియలు జరిపారు. అనంతరం ఆమె కుమారుడు గౌతం సంప్రదాయబద్ధంగా అంత్యక్రియల విధి విధానాలు పాటించారు.

ప్రధాని మోదీ సంతాపం

భారతీయ చలనచిత్రరంగంలో మేటి నటిగా రాణించిన బీ సరోజాదేవి మృతిపట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంతాపం ప్రకటించారు. ఎక్స్ ద్వారా తన సంతాప సందేశం పంపారు. సరోజాదేవి మృతి పట్ల దుఃఖం చెందానని, భారతీయ సినిమా, సంస్కృతి ఆదర్శప్రాయానికి ఐకాన్‌గా సరోజాదేవి గుర్తు ఉంటారన్నారు. ఆమె వైవిధ్యమైన నటన జ్ఞాపకాలు కానున్నాయన్నారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని, ఓం శాంతి అంటూ పోస్ట్ చేశారు.



అభిమానులను నియంత్రిస్తున్న పోలీసులు

డీఐజీగా కార్తీక కటియార్

● బళ్లారి డివిజన్‌కు తొలి మహిళ



బళ్లారి, జూలై 15(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీఐజీపీ)గా మహిళా అధికారి కార్తీక కటియార్ ను ప్రభుత్వం నియమించింది. గతంలో ఇక్కడ డీఐజీపీ గా పనిచేసిన లోకేష్ పదవీ విరమణతో ఇక్కడ పోస్టు ఖాళీగా ఉంది. బళ్లారి డీఐజీపీ రేంజ్ పరిధిలో బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగర నాలుగు జిల్లాలు ఉంటాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్తిక కటియార్ ఐపీఎస్ 2010 బ్యాచ్ ఎంపిక అయ్యారు. బెళగావి. కొడుగు. జిల్లాలో ఎస్పీగా పనిచేశారు. ఏసీబీ ఎస్పీగా పనిచేశారు. ఆమే ఉత్తరకన్నడ జిల్లాలో తొలిమహిళా ఎస్పీగా పనిచేశారు. బళ్లారి డీఐజీగా కూడా ఇంతవరకు మహిళలు ఎవ్వరూ పని చేయలేదు. వృత్తిరీత్యా ఆమె ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నారు. అంతే కాకుండా తన భర్త కట్నం కోసం వేదిస్తున్నాడని భర్తపైనే కోర్టులో కేసు వేసిన మహిళ ఆమే.

విజయనగర ఎస్పీగా జాహ్నవి



విజయనగర జిల్లా కొత్త ఎస్పీగా జాహ్నవి నియమితులైయ్యారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్పీ శ్రీహరిబాబు ను బెంగళూరు సీసీబీ కి బదిలీ చేశారు. ఐపీఎస్ 2019 బ్యాచ్‌లో జాహ్నవి ఎంపిక అయ్యా రు. ప్రస్తుతం ఆమె మైసూర్‌లో పనిచేస్తున్నారు.

భూస్వాధీన ప్రక్రియ రద్దు

● ఫలించిన దేవనహళ్ళి రైతుల పోరాటం ● రైతులను కష్టపెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు: సీఎం

బెంగళూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా చన్నరాయపట్టణ హోబళి పరిధిలోని 13 గ్రామాల్లో 1,777 ఎకరాల భూమి స్వాధీన ప్రక్రియను ప్రభుత్వం రద్దు చేసింది. బాధిత రైతులతో పాటు ప్రజాసంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో జరిపిన చర్చలు ఫలించాయి. మంగళవారం విధానసౌధలో రైతులు, ప్రతినిధులతో సీఎం ప్రత్యేకంగా చర్చలు జరిపారు. రైతులు భూములు వదులుకునేందుకు సిద్ధంగా లేరని ప్రతినిధులు తేల్చిచెప్పారు. దీంతో కేఐఏడీబీ చేపట్టిన భూస్వాధీన ప్రక్రియను విరమించుకుంటున్నట్లు సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. అయితే రైతులు ఇష్టపూర్వంగా ఇస్తే స్వాధీనం చేసుకుంటామన్నారు. 1,777 ఎకరాలను డీ నోటిఫికేషన్‌ను పూర్తిగా విడిచినట్లయ్యింది. చన్నరాయపట్టణ హోబళిలోని 13 గ్రామాల పరిధిలో కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలెప్‌మెంట్ బోర్డు (కేఐఏడీబీ) 1777 ఎకరాలను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా రైతులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. దాదాపు 1200 రోజులుగా రైతులు నిరసన కొనసాగించారు. ఇటీవల కొన్నిరోజులుగా ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వడంతో బెంగళూరు ఫ్రీడంపార్కులో రిలే పోరాటాలు జరిగాయి. ముఖ్యమంత్రి ఇప్పటికే బాధిత రైతులు, ప్రతినిధులతో రెండుసార్లు చర్చలు జరిపారు. చివరగా మంగళవారం జరిగిన సమావేశంలో భూస్వాధీన ప్రక్రియను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. సమావేశంలో మంత్రులు ఎంబీ పాటిల్, హెచ్‌కే పాటిల్, కేహెచ్ మునియప్ప, ప్రియాంక ఖర్గేతోపాటు పలువురు పాల్గొన్నారు. రైతులకు మద్దతుగా నటుడు ప్రకాశ్‌రాజ్, ఎస్ఆర్ హిరేమఠ్ తదితరులు పాల్గొన్నారు.



విధానసౌధలో మీడియాతో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంజునాథ్ గౌడ

బళ్లారి.. కాంగ్రెస్ కంచుకోట

● బీజేపీ ఎత్తులు ఇక్కడ సాగవు: యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మంజునాథ్ గౌడ
● నగరంలో కార్యకర్తల ఘనస్వాగతం

8

గిరిజనులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీ తుకారాం



పంచమశాలి మఠానికి తాళం

● కంటతడిపెట్టిన బసవమృత్యుంజయ స్వామీజీ

7



కూడలసంగమలోని పంచమశాలి మఠం

సామాజిక న్యాయమే రాజ్యాంగ లక్ష్యం

● ఓబీసీలతోనే సమగ్రత సాధ్యం ● ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి తొలి సమావేశంలో సీఎం సిద్దరామయ్య


బెంగళూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దేశ సామాజిక న్యాయంపై అన్ని కులాలకు సమగ్రంగా సౌలభ్యాలు ఉండాలని, అది కేవలం కొన్ని వర్గాలకే పరిమితం సరికాదని రాజ్యాంగం పొందుపరిచిందని సీఎం సిద్దరామయ్య అన్నారు. శతాబ్దాల శ్రమ, దశాబ్దాల మౌనం ఓబీసీల పోరాటానికి ప్రస్తుతం సరైన సమయమని అభిప్రాయపడ్డారు. ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి తొలి సమావేశం నగరంలో మంగళవారం రాత్రి కేపీసీసీలో జరిగింది. భారత్‌జోడో భవనంలో జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ ఓబీసీ సంచాలకులు డాక్టర్ అనిల్‌జైహింద్, డీసీఎం డీకే శివకుమార్, మాజీ సీఎంలు వీరప్పమొయిలీ, అశోక్ గెహ్లాట్, నారాయణస్వామితోపాటు బీకే హరిప్రసాద్, ఆలూరు ప్రకాశ్, జ్యోతిమణి తదితరులు పాల్గొన్నారు. దేశ ప్రయాణం నిర్ణయాత్మక దశలో ఉందని, విభజనశక్తులకు ఎదురొడ్డి పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీఎం సిద్దరామయ్య అన్నారు. రాష్ట్రంలో ఆర్థికమంత్రిగా 1995లో బీసీ కమిషన్ చట్టాన్ని అంగీకరించామని, సామాజిక, విద్య, ఆర్థిక అంశాల కొలబద్ధ ప్రకారం బీసీ కులాలను గుర్తించి వర్గీకరించి రక్షించేందుకు శాసనబద్ధమైన నిబంధనలు ఏర్పాటు చేశామని, ఇవి బలోపేతంతో రాజ్యాంగ సాధనలన్నారు. యూపీఏ-2 పాలనలో దేశవ్యాప్తంగా కులగణన జరిపారన్నారు. 1931 తర్వాత తొలిసారి కులాల వంచితుల గణాంకాలు తేలాయన్నారు. అయితే బీజేపీ బీసీ వర్గాల సంక్షేమం దృష్ట్యా గణాంకాలను పరిణామకారిగా వినియోగించలేదన్నారు. కర్ణాటకలో 1960లో డాక్టర్ ఆర్ గౌగనగౌడ సమితి, బీసీ కులాల సమీక్ష ప్రారంభించిందన్నారు. అది భవిష్యత్తు మార్గకాలకు దారిదీపమైందన్నారు. 1975లో హావనూరు కమిషన్, 1983లో వెంకటస్వామి, 1990లో చిన్నప్పరెడ్డి కమిషన్‌లు పనిచేశాయన్నారు. 2015లో నా పాలనలోనే కాంతరాజ్ కమిషన్‌ను రూపొందించామని 1.30 కోట్ల కుటుంబాలకు సంబంధించి సమీక్ష చేశామన్నారు. అయితే 2019 నుంచి 2023 దాకా నివేదికను ప్రవేశపెట్టకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. రాష్ట్రంలో రెండో సర్వేకు ఆహ్వానించామని, తద్వారా సామాజిక న్యాయం చేసేందుకు కట్టుబడ్డామన్నారు. ముఖ్యమంత్రిగా సామాజిక పోరాటాలలో వినమ్రంగా భాగస్వామిని అయ్యానని ధృఢనిశ్చయంతో తెల్పుతున్నానన్నారు. ప్రజాప్రభుత్వంలో న్యాయవ్యవస్థ కేవలం చట్టాలను మాత్రమే వ్యాఖ్యానించదని, బదులుగా సామాజిక న్యాయం కూడా ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఓబీసీ రిజర్వేషన్ అవసరమని, సుప్రీంకోర్టు ఇటీవల ప్రస్తావించిందన్నారు. న్యాయస్థానాలతో మాత్రమే బీసీ వర్గాల ప్రగతి సాధ్యం కాదని, రాజకీయ ఇచ్ఛాశక్తి, పాలనాపరమైన ప్రక్రియ ముఖ్యమన్నారు. సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ ప్రకటించిన బీజేపీ ఆ దిశగా ముందుకెళ్లడం లేదన్నారు. ఓబీసీ సలహామండలి పాత్ర భవిష్యత్తుకు మార్గదర్శకం కానుందన్నారు. వివిధ రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు తమ పాలనలో సాగించిన ప్రగతిని వివరించారు.



సమావేశంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే తదితరులు



చినుకు రాదు..కునుకు లేదు..!



● అన్నదాత చూపు ఆకాశం వైపు ● వాన కురవక, విత్తనం మొలవక రైతులు దిగాలు ● ఇప్పటికి 30 శాతమే సాగు ● ఆయకట్టు వరకు పర్వాలేదు.. వర్షాధార రైతుకు నిరాశే

బళ్లారి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ రైతును ఊరించిన వాన సరైన సమయానికి ముఖం చాటేసింది. వాన జాడ లేని కారణంతో జూలై రెండో వారం దాటిపోతున్నా విత్తన పడక రైతులు దిగులు ఆందోళన చెందుతున్నారు. కార్తులు దాటిపోతుండడంతో వాన చినుకు కోసం అన్నదాత ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. కొన్ని చోట్ల వానలు కురుస్తున్నా, మరి కొన్ని చోట్ల వాన జాడ లేకుండా పోయింది. బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగర, చిత్రదుర్గం జిల్లాల్లో వర్షాధారం కింద కేవలం 30 శాతం భూముల్లోనే విత్తనం సాధ్యం అయ్యిందని వ్యవసాయశాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. తుంగభద్ర జలాశయం కింద ఆయకట్టు భూములు మినహాయిస్తే వర్షాధారం కింద సాగు చేయాల్సిన పొలాల్లో 70 శాతం వరకూ విత్తనం పడక వాన కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. బళ్లారి జిల్లాలో ఖరీఫ్‌లో 1,63,754 హెక్టార్లు సాగు కావాల్సి ఉంది. ఇందులో 52,173 హెక్టార్లలో మాత్రమే సాగు అయింది. విజయనగర జిల్లాలో 1,48,674 హెక్టార్లకు 48,523 హెక్టార్లు సాగు అయింది. చిత్రదుర్గం జిల్లాలో 1,90,465 హెక్టార్లకు గాను 51,235 హెక్టార్లలో సాగు అయింది. కొప్పళ జిల్లాలో 1,84,586 హెక్టార్లకు గాను 51,876 హెక్టార్లు సాగు అయ్యింది. మొత్తం మీద 30 శాతం మాత్రమే సాగు అయిందని వ్యవసాయ శాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. తుంగభద్ర ఆయకట్టు కింద బళ్లారి, రాయచూరు, కొప్పళ జిల్లాలో మినహాయిస్తే చాలా వరకు వర్షాధారంతోనే పంటలు సాగు చేస్తారు. కూడ్లిగి, కొట్టూరు, హువ్వినహడగలి, హగరిబొమ్మనహళ్లి, చిత్రదుర్గం, మొల్కాల్మూరు. తదితర నియోజకవర్గాల్లో చాలా వరకు వర్షాధారంతోనే రైతులు సాగుచేస్తారు. వేరుశనగ, ముంగారి పత్తి, జొన్న, మొక్కజొన్న కంది తదితర పంటలు రైతులు సాగు చేస్తారు. ఖరీఫ్‌లో ముందుగా వానలు బాగానే కురిశాయి. రైతులు పొలాలు దుక్కిదున్నుకుని విత్తనానికి సిద్ధమయ్యారు. అరకొర వానలకు కొందరు రైతులు విత్తనం వేసుకున్నారు. మరి కొందరు భూమిలో తేమ లేక పోవడంతో వాన కోసం ఎదురు చూస్తున్నారు. జూలై 15 దాటిపోతోంది. విత్తన కార్తులు అనుకూలంగా ఉంటాయో లేదో అనే భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అరకొర తేమకువిత్తిన విత్తనం మొలకెత్తక పోవడంతో రైతులు రోజూ పొలానికి వెలజ్జ విత్తనం మొలకెత్తిందా లేదా అని చూస్తున్నారు. భూమిలో తేమ తగ్గడం కారణంగా విత్తిన విత్తనం కూడా మెలకెత్తకుండా పోయిందని కొందరు రైతులు దిగులు చెందుతున్నారు. మరో నాలుగైదు రోజుల్లో వాన రాకపోతే విత్తనాలు మొలకెత్తవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు ఈసారి కూడా వానలు పై ఆశలు వదులుకుని వలస పయనం అవుతున్నామని వాపోతున్నారు. పశ్చిమ కనుమల్లో వానలు బాగా కురుస్తున్నాయి. తుంగభద్ర డ్యాం కు నీరు చేరుతున్నాయి. కానీ ఇక్కడ వాన కురవని కారణంగా వర్షాధారం కింద సాగు చేయాల్సిన రైతులకు కష్టాలు తప్పవని వాపోతున్నారు.

బొలెరో ఢీకొని వ్యాపారి మృతి

కదిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కదిరి-మదనపల్లి రోడ్డులో మిస్టర్ టీ దుకాణం ఎదురుగా మంగళవారం బొలెరో వాహనం ఢీకొని వ్యాపారి గంగన్న (56) మరణించాడు. సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అడపాల వీధికి చెందిన గంగన్న ద్విచక్రవాహనంలో చింతపండు తీసుకెళ్లి, విక్రయిస్తుండేవాడు. అందులో భాగంగా మంగళవారం కదిరి-మదనపల్లి రోడ్డులోని మిస్టర్ టీ దుకాణం ఎదురుగా వాహనం బైక్ నిలిపి, అక్కడే కూర్చున్నాడు. అతివేగంతో వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగన్నను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా మృతిచెందినట్లు సీఐ తెలిపారు. గంగన్న భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు. బొలెరో వాహన డ్రైవర్ షేక్ షాహీర్‌బాషాపై కేసు నమోదు చేశామన్నారు. గంగన్నకు పిల్లలు లేరు.

పోస్టుమార్టం ఆలస్యం.. బంధువుల ఆందోళన



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

గంగన్న మృతదేహానికి పోస్టుమార్టం చేయడంలో వైద్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ అతడి బంధువులు.. ఆస్పత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు. పోలీసులు రిపోర్టు ఇవ్వకుండానే తాము పోస్టుమార్టం చేయలేమని వైద్యులు చెప్పారు. పోస్టుమార్టం చేసేలోపే రిపోర్టు ఇచ్చామని పోలీసులు చెప్పారు. మొత్తంమీద పోస్టుమార్టం చేయడంలో వైద్యులు నిర్లక్ష్యం వహించారని మృతుని బంధువులు ఆవేదన చెందారు.

ఈజీగా.. కొట్టుకెళ్లారు..!



రామాంజులమ్మ

నల్లమాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లాలంటే దుండగులు పెద్ద పథకమే వేస్తారు. చాలా రిస్కే తీసుకుంటారు. నడుచుకుంటూ వెళ్తున్న, ఇళ్లు, దుకాణాల్లో ఉన్న మహిళల మెడలోని గొలుసును అకస్మాత్తుగా లాగేస్తుంటారు. ఒక్కోసారి గొలుసును మహిళలు గట్టిగా పట్టుకుంటే బైక్‌లోని దుండగులు కిందపడిపోయిన సందర్భాలున్నాయి. అలా.. పోలీసులకు కూడా దొరికిపోయారు. మరికొందరు గాయాలపాలయ్యారు కూడా. నల్లమాడలో మాత్రం చాలా ఈజీగా గొలుసు కొట్టుకెళ్లారు దొంగలు. మండలకేంద్రంలోని గ్రామీణ బ్యాంకు పక్కన సుధాకర్‌రెడ్డి ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఆయన భార్య రామాంజులమ్మ షాపులో ఉన్నారు. ఆ సమయంలో ఇద్దరు దుండగులు షాపు వద్దకొచ్చారు. గమ్ కావాలని అడగ్గా.. ఆమె ఇచ్చారు. దుండగులు రూ.వంద నోటు ఇచ్చారు. ఆమె చిల్లర ఇస్తుండగా.. 'పెద్దమ్మా.. నీ మెడలోని బంగారు గొలుసు ఇలా ఇవ్వు.. చూసి.. ఇస్తామన్నా'రు. ఆమె గొలుసు ఇచ్చేశారు. ఓ పేపర్ ఇవ్వమనగా.. ఆమె ఇచ్చారు. చిల్లర ఇస్తుండగా.. దుండగులు పరుగెత్తుకుంటూ వెళ్లిపోయారు. దీంతో రామాంజులమ్మ లబోదిబోమంటూ విషయం భర్త సుధాకర్ రెడ్డికి చెప్పింది. అతడు.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీ కార్యకర్తపై కేసు

బత్తలపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త బండి కిష్టప్పపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి శ్రద్ధాంజలితో కూడిన ఫొటోను బండి కిష్టప్ప తన మొబైల్‌లో వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. ఇది గమనించిన టీడీపీ నాయకులు కాకర్ల సురేంద్రనాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థి అదృశ్యం



దేవభూషణ్

కణేకల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కణేకల్లు క్రాసింగ్‌లో గల గురుకుల పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి దేవభూషణ్ సోమవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. కళ్యాణదుర్గం నియోజకవర్గం పిల్లలమర్రి గ్రామానికి చెందిన హనుమప్ప కుమారుడైన దేవభూషణ్ సోమవారం రాత్రి పాఠశాల హాస్టల్ నుంచి కనిపించకుండా పోయాడు. ఉపాధ్యాయులు ఈ విషయంపై తల్లిదండ్రులకు సమాచారం అందించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎద్దు పొడవడంతో రైతు మృతి

రొద్దం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన రైతు బండి వెంకటప్ప(70)ను ఎద్దు పొడవడంతో మృతి చెందాడు. బంధువులు తెలిపిన మేరకు వెంకటప్ప మంగళవారం ఉదయం 11గంటలకు ఇంటి పక్కనే ఉన్న పొలంలో ఎద్దును పట్టుకునేందుకు వెళ్లాడు. అది పొడవడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి అతడి తల తగిలింది. దీంతో అక్కడే కుప్పకూలిపోయాడు. బంధువులు పరిశీలించి, మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. ఎస్ఐ నరేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించిం, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెనుకొండకు తరలించారు.

హోదాలు మారాయ్..

భూసంరక్షణ విభాగంలో మార్పులు
జిల్లాకు ఈఈ, డీఈఈ పోస్టులు మంజూరు

అనంతపురం అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): భూసంరక్షణా విభాగ అధికారుల హోదాను ప్రభుత్వం మార్పు చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు భూసంరక్షణ విభాగంలో వ్యవసాయాధికారి (ఏఓ), వ్యవసాయ సహాయ సంచాలకుడు (ఏడీఏ), వ్యవసాయ ఉప సంచాలకుడు (డీడీఏ), వ్యవసాయ సంయుక్త సంచాలకుడు (జేడీఏ) హోదా అధికారులు ఉండేవారు. ఏఓను ఏఈఈ (అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)గా, ఏడీఏను డీఈఈ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)గా, డీడీఏను ఈఈ(ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)గా, జేడీఏను ఎస్ఈ(సూపరింటెండెంట్ ఇంజనీర్)గా హోదాలు మార్పుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాకు ఒక్కో ఈఈ, డీఈఈ పోస్టులను కేటాయించింది.

తాడిపత్రి ఇన్నర్‌వీల్ క్లబ్‌కు అవార్డులు

తాడిపత్రి, జూలై 15(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి ఇన్నర్‌వీల్ క్లబ్‌కు మూడు అవార్డులు వచ్చాయని అధ్యక్షురాలు కౌసర్‌బేగం మంగళవారం తెలిపారు. ఉత్తమ అధ్యక్షురాలుగా కౌసర్‌బేగం, ఉత్తమ కార్యదర్శిగా రేణుకాదేవి, కోశాధికారిగా శ్రీవాణి అవార్డులు గెలుపొందారని, కర్ణాటకలోని హోస్పేట్‌లో వారు ఆ అవార్డులు అందుకున్నారని తెలిపారు.

ఘనంగా పామిడమ్మ తిరునాళ

పామిడి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ గ్రామ దేవత పామిడమ్మ అమ్మవారి తిరునాళను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి విశేష పూజలు చేపట్టారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2025 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 21న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని, 23న గాంధీ చౌక్‌లోని ఐటీఐ కళాశాలలో కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు.

కమిటీ ఎన్నిక

రాయదుర్గంరూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఫాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఫాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు ఫాస్టర్ మార్క్, జిల్లా ఈసీ మెంబర్ జాషువా మంగళవారం పేర్కొన్నారు. అధ్యక్షుడిగా సురేష్, ఉపాధ్యక్షుడిగా మోషే, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హరి, కార్యదర్శిగా సతీష్‌ను ఎన్నుకున్నారు.

గండం.. గట్టెక్కించారు..!



- పూర్తయిన హెచ్చెల్సీ మరమ్మతులు
- నీటి సరఫరాకు మార్గం సుగమం
- గండ్ల భయానికి స్వస్తి

కణేకల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి లోనైన తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)పై కూటమి ప్రభుత్వ శ్రద్ధ పెట్టింది. యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులను పూర్తి చేసింది. రూ.35 కోట్ల వ్యయంతో కణేకల్లు హెచ్చెల్సీ పరిధిలో పలు పనులను పూర్తి చేసి, నీటి సరఫరాకు మార్గం సుగమం చేశారు. గత వైసీపీ పాలకులు కాలువ ఆధునికీకరణ కోసం రూపాయి కూడా ఖర్చు చేసిన పాపాన పోలేదు. చిన్నచిన్న మరమ్మతులు కూడా చేయకపోవడంతో ఐదేళ్ల వైసీపీ పాలనలో హెచ్చెల్సీకి పలుసార్లు గండ్లు పడి, నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయి.

కూటమి పాలనలో పూర్వ వైభవం

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హెచ్చెల్సీపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హెచ్చెల్సీ మరమ్మత్తుల కోసం నిధులు సాధించడంలో సఫలీకృతులయ్యారు. డీ.హీరేహాళ్ మండలంలోని మల్లికేతి బ్రిడ్జికి రూ.1.20 కోట్లు, నాగలాపురం బ్రిడ్జికి రూ.1.60 కోట్లు, బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహొన్నూరు బ్రిడ్జికి రూ.1.60 కోట్లు, కణేకల్లు మండలంలోని నాగేపల్లి బ్రిడ్జికి రూ.1.47 కోట్లు, యర్రగుంట వద్ద ఉన్న యూటీకి రూ.4.10 కోట్లు ఇక 115 కి.మీ. నుంచి 136 కి.మీ. వరకు లైనింగ్ పనులకు దాదాపు రూ.7.42 కోట్లు నిధులను కేటాయించారు. ఆ మేరకు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేశారు. దీంతో నీటి సరఫరాకు ఢోకా లేకుండా పోయింది. ప్రధానంగా యూటీల వద్ద లైనింగ్ సక్రమంగా లేనిచోట గతంలో పలుసార్లు గండ్లు పడి రైతులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం అలాంటి చోట్ల పనులు పూర్తవడంతో రైతులకు ఇబ్బంది లేకుండా ఉండవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. కూలిపోయిన బ్రిడ్జి స్థానంలో నూతనంగా నిర్మించారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తిచేయడంతో కాలువకు పూర్వ వైభవం వచ్చింది.

> "హెచ్చెల్సీకి నీరు వదులుతున్నారంటే అందరూ సంతోషపడాలి. గత ఐదేళ్లూ భయపడేవారు. ఎక్కడ గండ్లు పడతాయో, కాలువ తెగిపోతుందోనని ఆందోళన చెందేవారు. అధికారుల్లో ఒకటే టెన్షన్. కాలువ సామర్థ్యం కన్నా చాలా తక్కువ మొత్తంలో నీటిని ప్రవహించేవారు. అయినా, గండ్లు పడేవి. నీటి సరఫరాను ఆపి, మరమ్మతులు చేయాల్సి వచ్చేది. గండ్లు పడిన చోట నీరు పొలాలను ముంచెత్తేది. దీంతో రైతులు నష్టపోయేవారు. ఇలా.. ఐదేళ్లూ భయం.. భయంగా.. సాగిపోయింది. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యమే అందుకు కారణం. ఐదేళ్లూ కాలువ మరమ్మతులు చేపట్టలేదు. పైసా కూడా నిధులివ్వలేదు. దీంతో ఏటా గండ్ల బెడద తప్పేదికాదు. కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే కాలువ మరమ్మతులు చేపట్టింది. పనులు పూర్తవడంతో నిరాటంకంగా నీరు సరఫరా కానుంది. దీంతో అన్నదాతలు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు."

వేగంగా మరమ్మతులు చేశారు



ఈ ఏడాది హెచ్చెల్సీ మరమ్మతులు చేస్తారని ఊహించలేదు. చాలా వేగవంతంగా పనులు పూర్తి చేయడం హర్షణీయం. కాలువ పటిష్టతకు మరిన్ని పనులు చేపట్టాలి.

- ఖలీద్, రైతు, కణేకల్లు

రైతులకు ఎంతో ఉపయోగకరం



హెచ్చెల్సీ మరమ్మతులు ఆయకట్టు రైతులకు ఎంతో ఉపయోగకరం. గతంలో కాలువ పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో పదేపదే గండ్లు పడి, నీటి సరఫరా నిలిచిపోయేది. మరమ్మత్తులు చేయడంతో అలాంటి పరిస్థితి ఉండకపోవచ్చని ఆశిస్తున్నాం.

- నాగభూషణం, రైతు, గంగలాపురం

80 శాతం పనులు పూర్తి చేశాం

హెచ్చెల్సీ సబ్‌డివిజన్ పరిధిలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల పరిధిలో దాదాపు 80 శాతం హెచ్చెల్సీ మరమ్మతులు పూర్తి చేశాం. యుద్ధప్రాతిపదికన యూటీ, బ్రిడ్జి, లైనింగ్ పనులు పూర్తి చేశాం. కణేకల్లు ఔట్‌ఫాల్ రెగ్యులేటర్, బిదురకుంతం బ్రిడ్జి మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు ఉండవు.

- దివాకర్, హెచ్చెల్సీ డీఈ, కణేకల్లు

అనంత క్రికెటర్లపై కాసుల వర్షం

ఏపీఎల్ వేలంలో భారీ ధరలు
అత్యధికంగా గిరినాథ్‌రెడ్డికి రూ.10.05 లక్షలు
11మంది జిల్లా క్రీడాకారులకు అవకాశం



గిరినాథ్‌రెడ్డి



వినయ్‌కుమార్



వీరారెడ్డి



ప్రశాంత్



అర్జున్ టెండూల్కర్



మల్లికార్జున



సంతోష్



దత్తారెడ్డి



కమిల్



దీపక్



మనోజ్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన క్రికెటర్లపై కాసుల వర్షం కురిసింది. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)-2025లో జిల్లా వాసులకు భారీ ధరలు దక్కాయి. ఆగస్టు 8 నుంచి 24వ తేదీ వరకు విశాఖపట్నంలో ఏపీఎల్ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 14న ఆటగాళ్ల వేలం విశాఖపట్నంలో నిర్వహించారు. ఆయా ఫ్రాంచైజీలు.. జిల్లా క్రికెటర్ల కోసం భారీగానే వెచ్చించాయి. జిల్లాకి చెందిన గిరినాథ్‌రెడ్డిని రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు రూ.10.05 లక్షలకు కొనుగోలు చేసింది. వినయ్‌కుమార్ కోసం అమరావతి రాయల్స్ జట్టు రూ.7.5లక్షలు వెచ్చించింది. వీరారెడ్డిని రూ.4.20లక్షలకి సింహాద్రి వైజాగ్ జట్టు, డీబీ ప్రశాంత్‌కుమార్‌ను రూ.2.20లక్షలకి తుంగభద్ర లయన్స్, అర్జున్ టెండూల్కర్‌ను రూ.1.2లక్షలకి కాకినాడ కింగ్స్, మల్లికార్జునను రూ.90వేలకి అమరావతి, సంతోష్‌ను రూ.60వేలకు అమరావతి రాయల్స్, దత్తారెడ్డిని రూ.60వేలకు తుంగభద్ర లయన్స్, కమిల్‌ను రూ.50వేలకి సింహాద్రి వైజాగ్, దీపక్‌ను రూ.30వేలకి తుంగభద్ర లయన్స్, మనోజ్‌ను రూ.30వేలకి రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్లు కొనుగోలు చేశాయి. ఈ సీజన్‌కు మాత్రమే కాంట్రాక్టు వర్తించనుంది.

అవగాహన పెంచుకోవాలి

పంచాయతీ పురోగతి సూచిక 2.0పై శిక్షణలో జడ్పీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పురోగతి సూచిక 2.0పై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని జడ్పీ సీఈఓ శివశంకర్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రంలోని సమావేశ భవనంలో శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించిన ఎంపీడీఓలు, ప్రతి మండలం నుంచి ఒక పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్‌కు మంగళవారం శిక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. పంచాయతీ పురోగతి సూచిక 2.0 కింద చేపట్టాల్సిన అంశాలను వివరించారు.

నిప్పుల గుండంలో నమాజ్



అగ్నిగుండంలో నమాజ్ చేస్తున్న షఫీ

ఉరవకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా అగ్నిగుండ ప్రవేశం చూస్తుంటాం. అగ్నిగుండంలోకి దిగి వచ్చేస్తుంటారు. ఉరవకొండలో నిప్పుల గుండంలో ఏకంగా నమాజ్ చేశారు. కణకణలాడే నిప్పులపై కూర్చుని నమాజ్ చేయడాన్ని చూసిన భక్తులు ఆశ్చర్యానికి లోనయ్యారు. పట్టణంలోని 10వ వార్డులో గల హసేన్, హుసేన్ పీర్ల చావిడిలో చిన్న పీర్ల పండుగ నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం ఏర్పాటు చేశారు. తొలుత నిర్వాహకుడు షఫీ అగ్నిగుండంలోకి దిగాడు. నిప్పులపై రుమాలు పరచుకుని, దానిపై కూర్చుని నమాజ్ చేశారు. తర్వాత సాయి కూడా అదే తరహాలో అగ్నిగుండంలో నమాజ్ చేశారు. భక్తులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. కొన్నేళ్లుగా ఈ ఆచారం కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

కనగానపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): సీఆర్‌పీఎఫ్ జవాన్ కె. మురళి అంత్యక్రియలు మంగళవారం అతడి స్వగ్రామం శివపురం గ్రామంలో జరిగాయి. సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ శ్రీరాములు, ఇతర అధికారులు జవాన్ పార్థివ దేహం ఉన్న శవపేటికను అతడి భార్య, తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం శవపేటికపై జాతీయజెండాను ఉంచి గౌరవ వందనం చేశారు. మురళికి సంబంధించిన పలు రికార్డులు, నగదును అధికారులు అప్పగించారు. అనంతరం కుటుంబికులు, బంధువులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున అంత్యక్రియల్లో పాల్గొని జవాన్ మురళికి కడసారి వీడ్కోలు పలికారు.



మురళి పార్థివ దేహంపై జాతీయ జెండాను కప్పుతున్న అధికారులు

నాన్న లేస్తాడు లేమ్మా..!

'ఏడవొద్దమ్మా..! వీళ్లందరూ వెళ్లిపోతే నాన్న లేస్తాడులేమ్మా' అని జవాన్ మురళి నాలుగేళ్ల కుమారుడు తారక్‌రామ్ తన తల్లితో అనడం అక్కడున్న అందరినీ కంటతడి పెట్టించింది. మురళి శవపేటికపై పడి భార్య పావని ఏడుస్తుంటే నాలుగేళ్ల చిన్నారి అమాయకంగా అందరివైపు చూస్తూ తల్లితో అన్నమాటలకు అక్కడున్న వారందరూ ఒక్కసారిగా బోరున విలపించారు.

అండగా ఉంటాం: ఎమ్మెల్యే పరిటాల సునీత

సీఆర్‌పీఎఫ్ జవాన్ కుటుంబానికి అండగా ఉంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అభయమిచ్చారు. మురళి పార్థివ దేహం వద్ద ఆమె నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. దేశసేవకుడు ఇలా మరణించడం బాధాకరమన్నారు. మురళి కుటుంబానికి పరిటాల కుటుంబం అండగా ఉంటుందని రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మురళి భార్య, తల్లిదండ్రులకు అనంతపురంలో వేర్వేరుగా రెండు సెంట్ల స్థలం. చెల్లెలు అంజలీకి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ సుధాకర్ చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య ఉన్నారు.

వానొస్తుందంట..!

రానున్న ఐదు రోజుల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం

బుక్కరాయసముద్రం, జూలై15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు రానున్న ఐదు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త నారాయణస్వామి తెలిపారు. పలు చోట్ల తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 34.8 నుంచి 35.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కావచ్చన్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.6-24.3 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉండవచ్చని తెలిపారు. నైరుతి దిశగా గాలులు గంటకు 13-14 కి.మీ వేగంతో వీచే అవకాశము ఉంటుందని, గాలిలో తేమ ఉదయం పూట 68-73 శాతం, మధ్యాహ్నం 41-67 శాతం నమోదు కావచ్చన్నారు. అనంతపురం జిల్లాలో బుధవారం 2 మి.మీ, 17న 5 మి.మీ, 18న 25 మి.మీ 19న 15 మి.మీ, 20న 10 మి.మీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో బుధవారం 2 మి.మీ, 17న 5 మి.మీ, 18న 28 మి.మీ 19న 13 మి.మీ, 20న 15 మి.మీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు.

కంది విత్తుకోవచ్చు

రానున్న ఐదు రోజులకు వర్ష సూచన ఉన్నందున కంది పంటను జూలై రెండో పక్షం వరకు విత్తుకోవచ్చన్నారు. ముందుగ విత్తిన కందిలో ఒత్తుగా ఉన్న మొక్కలను పలుచన చేయాలి. మొక్కకు మొక్కకు మధ్య 20 సెం.మీ దూరం ఉండేలా చూసుకోవాలి. నీటి పారుదల కింద సాగు చేసిన వేరుశనగ పూత దశలో ఉంది. రైతుల ఎకరాకు 200 కిలోల జిప్సం ఎరువును ఈ దశలో వేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు ముందుగా విత్తిన వేరుశనగలో మొదలు కుళ్లు, రసం పీల్చే పురుగులు ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు కార్బండిజిం మాంకోజెబ్ 2గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదలు బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు.

ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నరేంద్రకుమార్



నరేంద్రకుమార్

గోరంట్ల, జూలై15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎంపీడీఓ సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా గోరంట్ల ఎంపీడీఓ నరేంద్రకుమార్ ఎన్నికయ్యారు. అనంతపురంలోని జడ్పీ భవనంలో శ్రీసత్యసాయి జిల్లా ఎంపీడీఓల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా ధర్మవరం ఎంపీడీఓ సాయిమనోహర్, ప్రధాన కార్యదర్శిగా పెనుకొండ నరేష్‌కృష్ణ, సహాయ కార్యదర్శిగా తలుపుల నసీమా, కోశాధికారిగా నల్లచెరువు రఘునాథ్‌గుప్త, కార్యవర్గ సభ్యులుగా అమరాపురం రామారావు, బుక్కపట్నం శ్రీనివాసులు, సీకేపల్లి బాలకృష్ణుడు ఎన్నికైనట్లు ప్రకటించారు.

బీటెక్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలో జూన్‌లో నిర్వహించిన బీటెక్ మొదటి, రెండో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ సెమిస్టర్ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. బీటెక్ ఒకటి , రెండో సెమిస్టర్(ఆర్23), సప్లిమెంటరీ(ఆర్20), (ఆర్19),(ఆర్15) ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూషన్ నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శివకుమార్ ప్రకటించారు. బీటెక్ మొదటి సెమిస్టర్ ఆర్23, ఆర్20, ఆర్19, ఆర్15 సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేశారు. ఫలితాలు జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషినల్ కంట్రోలర్ శంకర్‌శేఖర్‌రాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి పాలిసెట్ తుది విడత కౌన్సెలింగ్

అనంతపురంరూరల్, జూలై15(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ తుది కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 17వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 17 నుంచి 19వ తేదీ వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 18 నుంచి 20వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్ల నమోదు చేస్తారన్నారు. ఈనెల 21న సీట్ల కేటాయింపు, పాలిటెక్నిక్ కళాశాలలో జాయిన్ కావడానికి 24 నుంచి 26వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు.

19న స్పాట్ అడ్మిషన్లు

జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగిలిపోయిన ఐవీసీ సీట్ల కోసం ఈనెల 19న స్పాట్ అడ్మిషన్లు అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తిగత అభ్యర్థులు దరఖాస్తులను అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 18వ తేదీలోగా అందజేయాలన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు.

బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోండి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల, గ్రామ స్థాయి అధికారులు ఒక్కో బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన పంచాయతీ సెక్టార్, జీరో పావర్టీ పీ4 తదితర అంశాలపై డ్వామా పీడీ, జడ్పీ సీఈఓ, డీపీఓ, ఆర్డీఓ, డీఎల్డీఓలు, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీ-4 కార్యక్రమం కింద జిల్లాలో 54వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉందన్నారు. ఇందుకోసం మార్గదర్శకుల గుర్తింపు వేగంగా చేపట్టాలన్నారు. ప్రతి రోజు 3వేల మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్నారు. ప్రతి మండలం నుంచి వంద మంది, మున్సిపాలిటీ నుంచి 200 మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లికి వందనం ఈకేవైసీకి సంబంధించి మదర్ చైల్డ్ ఈకేవైసీ పెండింగ్, గ్రీవెన్స్ పెండింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ వందశాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

19న స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

ఈనెల 19న స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కింద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి సంబంధించి ప్రజలందరికీ తెలిసే విధంగా శుక్రవారం టాంటాం వేయించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై దృష్టి సారించాలన్నారు. క్లాత్ బ్యాగులను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీసీలో డీపీఓ నాగరాజునాయుడు, సీపీఓ అశోక్‌కుమార్, జెడ్పీ సీఈఓ శివశంకర్, ఆధార్ నోడల్ అధికారి నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కస్టమర్ల డబ్బుతో ఉడాయించిన స్వర్ణకారుడు

గుంతకల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ స్వర్ణకారుడు కస్టమర్లను నమ్మించి, పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసి ఉడాయించారు. పట్టణానికి చెందిన 30 మంది బాధితులు సోమవారం అతడి షాపు వద్దకు వచ్చి ఆందోళన నిర్వహించారు. పట్టణానికి చెందిన షేక్ నూరుల్లా పాత గుత్తి రోడ్డులోని చౌడమ్మ దేవాలయం వద్ద బంగారు నగల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఇతడు తన పాత ఖాతాదారుల నుంచి బంగారు నగల కోసం వాయిదా పద్ధతితో డబ్బు వసూలు చేసి, చెప్పిన మొత్తాలు చెల్లించిన తర్వాత నగలను తయారు చేసి ఇచ్చేవాడు. దాదాపు పదేళ్ల నుంచీ ఈ వ్యవహారం నడుతుండేవాడు. ప్రస్తుతం దుకాణం తెరవకుండా సెల్ ఫోన్ స్విచ్చాఫ్ చేయడంతో డబ్బు చెల్లించిన వారు అతడి దుకాణం వద్దకు వచ్చి ఆందోళన నిర్వహించారు. బాధితులు మాట్లాడుతూ మూడు నెలల నుంచీ నూరుల్లా తమకు అందుబాటులో లేకుండాపోయాడన్నారు. మరి కొన్ని రోజుల్లో స్కీం పూర్తవుతుందని, తమకు నగలు చేసి ఇస్తాడని భావిస్తున్న తరుణంలో అదృశ్యమయ్యాడని వాపోయారు. ఈ విషయంగా పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు. షాపు వద్ద ఆందోళన నిర్వహించిన వారు మాట్లాడుతూ 30 మంది దాదాపు రూ. 77 లక్షలు నూరుల్లాకు చెల్లించామని, తీరా ఇప్పుడు తమకు అన్యాయం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థి చేతికి గాయం

గుంతకల్లుటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం భోజనం సమయంలో ప్లేట్ కోసం జరిగిన తోపులాటలో పదో తరగతి విద్యార్థి రామన్న చేతికి గాయమైంది. ఆ బాలుడిని ఉపాధ్యాయలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. భోజన సమయంలో ఉపాధ్యాయులు పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని డీవైఎఫ్ఐ నాయకులు సురేంద్ర, వంశీ, కిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

గుత్తి,జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ఎరువుల దుకాణాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. బాలాజీ ఫర్టిలైజర్స్ దుకాణంలో సరైన వివరాలు లేని రూ.1.37 కోట్ల విలువ చేసే ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపేశారు. అలాగే చౌడేశ్వరి సీడ్స్‌ను, ఇండ్రస్టియల్ ఏరియాలో ఉన్న కెమిసైడ్ పురుగుల మందు తయారీ ఫ్యాక్టరీని తనిఖీలు చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

డీకే పట్టమ్మాళ్ (వర్ధంతి)




పద్మవిభూషణ్ గ్రహీత ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు డీకే పట్టమ్మాళ్ 1919 మార్చి 19న తమిళనాడు రాష్ట్రం కాంచీపురంలో జన్మించారు. తమిళ సినిమాలకు నేపథ్యగాయనిగా రాణించారు. బాల్యం నుంచే గానాలాపనలో ప్రతిభను కనబరిచారు. ఎంఎస్ సుబ్బలక్ష్మి, ఎంఎల్ వసంత కుమారిలకు సమకాలీనులు. ఈ ముగ్గురూ కర్ణాటక సంగీతంలో స్త్రీరత్నత్రయంగా పేరొందారు. రాగం, తాళం, పల్లవిలలో రాణించారు. పద్మభూషణ్, గాన సరస్వతి, సంగీత నాటక అకాడమీ పురస్కారాలు అందుకున్నారు. దేశ విదేశాలలో కచేరీలు నిర్వహించి సంగీతప్రపంచంలో ధ్రువతారగా నిలిచారు. 2009 జూలై 16న కన్నుమూశారు.

పరమేశ్వర్ గోద్రెజ్ (జయంతి)



ప్రముఖ గోద్రెజ్ సంస్థ ఛైర్మన్ ఆది బుర్జోర్జి గోద్రెజ్ భార్య పరమేశ్వర్ గోద్రెజ్ 1945 జూలై 16న జన్మించారు. గోద్రెజ్ సంస్థ ఉన్నతికి పాటుపడడమే కాకుండా సంఘసంస్కర్తగా, పరోపకారిగా గుర్తింపు పొందారు. ఎయిరిండియాలో తొలి ఎయిర్ హోస్టెస్‌లలో ఒకరు. ఎయిడ్స్‌పై పోరాటానికి ప్రజలలో అవగాహన కల్పించేందుకు బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్, క్లింటన్ గ్లోబల్ ఇన్షియేటివ్స్ తదితర స్వచ్ఛంద సంస్థలతో కలసి పనిచేశారు. 2016 అక్టోబరు 10న కన్నుమూశారు.

కత్రినా కైఫ్ (పుట్టినరోజు)



బాలీవుడ్ హీరోయిన్ కత్రినాకైఫ్ 1983 జూలై 16న హాంగ్‌కాంగ్‌లో జన్మించారు. ఆంగ్ల మోడల్‌గా కాక దేశంలో అత్యధిక రెమ్యూనరేషన్ నటీమణిగా ఒకరు. 2003 నుంచి మోడల్‌గా, సినీ రంగంలో తన సత్తా చాటుకుంటున్నారు. మోస్ట్ బ్యూటిఫుల్ సెలెబ్రిటీలలో ఒకరిగా నిలిచారు. 3 స్టార్ డస్ట్ అవార్డులు, 4 జీ సినీ అవార్డులు, 4 స్క్రీన్ అవార్డులు, 1 ఐఐఎఫ్ఏ అవార్డు, 4 ఫిల్మ్‌ఫేర్, 2 స్టార్ గిల్డ్ అవార్డులు ఇతర పురస్కారాలు అందుకున్నారు. నటుడు వికీ కౌశల్‌ను పెళ్లాడారు. లండన్‌లోని 'మేడమ్ టస్సాడ్ మ్యూజియంలో 'మైనపుబొమ్మ'గా అవకాశం పొందిన 8వ బాలీవుడ్ నటి. అంతేకాక ట్రస్టు ద్వారా సమాజసేవా కార్యక్రమాలు నిర్వ హిస్తున్నారు. కాగా చారిటీ ద్వారా అనాథ శిశువుల సంక్షేమానికి పాటుపడుతున్నారు.

గ్రేటర్ బెంగళూరుకు 5 పాలికెలు.. త్వరలోనే ఎన్నికలు

» డీసీఎం డీకే శివకుమార్



సమావేశాన్ని ప్రారంభిస్తున్న డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

బెంగళూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ)ని ఐదు పాలికెలుగా విభజించి త్వరలోనే ఎన్నికలు జరుపుతామని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. కేపీసీసీ కార్యాలయం భారత్‌జోడో భవన్‌లో మంగళవారం గ్యారెంటీ పథకాల అమలు కమిటీ జిల్లా, తాలూకా స్థాయి పదాధికారుల సమావేశం జరిగింది. గ్యారెంటీ అమలు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్‌ఎం రేవణ్ణ, మంత్రి కృష్ణబైరేగౌడ, కేపీసీసీ ప్రచార కమిటీ వినయ్‌కుమార్ సొరకె, కార్యాధ్యక్షుడు జీసీ చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ నగరంలో పాలనాదృష్ట్యా ఐదు పాలికెలను ఏర్పాటు చేయాలని తీర్మానించామన్నారు. పాలికె ద్వారా కార్యకర్తలకు ఎక్కువ అవకాశాలు కల్పించదలిచామన్నారు. నేనొక్కడే అధికారం తీసుకురావడం సాధ్యం కాదని, కార్యకర్తల కృషే ముఖ్యమన్నారు. మా ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి 25శాతం నిధులు ఖర్చు చేశామన్నారు. వార్డు, పంచాయతీ స్థాయిలో గ్యారెంటీ పథకాల సమావేశం జరపాలని భావిస్తున్నామన్నారు. 33శాతం రిజర్వేషన్ అమలైతే 75మంది మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వస్తారన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవ్: ఎమ్మెల్యే



కేడీపీ సమావేశంలో ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్

ముళబాగిలు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రజలకు కనీస పనులు చేసేవేళ లంచం తీసుకుంటూ ఇప్పటికే కొంతమంది లోకాయుక్త వలలో పట్టుబడ్డారని, అవినీతి అధికారులకు తగిన బుద్ధి తప్పదని ఎమ్మెల్యే మంజునాథ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ఏపీఎంసీ ఆవరణలో మంగళవారం ఏర్పాటైన కర్ణాటక డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (కేడీపీ) సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కొంతమంది ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి మంచి జీతాలు ఉన్నా పేద రైతులు, సామాన్యులనుంచి లంచాలు ఆశిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. లంచం చట్టరీత్యా నేరమని గుర్తించాలన్నారు. కాగా ప్రభుత్వ సేవను ప్రామాణికంగా నిర్వహించడం ద్వారా మంచి పేరొందిన అధికారులు కూడా ఉన్నారన్నారు. అయితే కొంతమంది అధికారులు ఎమ్మెల్యేకు లంచం ఇవ్వాలంటూ ప్రజలను వంచిస్తున్నారని అటువంటివారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తద్వారా నాకు చెడ్డపేరు వస్తోందని వాపోయారు. తాను ఎవరివద్దా లంచం తీసుకోలేదని, దక్షతతో విధులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇదే సందర్భంగా వివిధశాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి సమాచారం పొందిన అనంతరం ప్రత్యేకించి రెవెన్యూ అధికారులపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. రాజకాలువ, గోమాళ భూములు భూమాఫియా పరం అవుతున్నాయని, వారికి కొందరు అధికారులు వత్తాసు పలుకుతున్నారని రానున్న రోజుల్లో తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తాలూకాలో కొంతమంది అధికారులు ఉత్తమంగా పనిచేస్తున్నారని, కొంతమంది అవినీతి అధికారుల వల్ల చెడ్డపేరు వస్తోందన్నారు. అటువంటివారు తమకు అవసరం లేదన్నారు. కొంతమంది ఎన్నో ఏళ్లుగా ఇదే తాలూకాలో పనిచేస్తున్నారని వెంటనే వారు బదిలీ చేసుకుని వెళ్లాలని లేనిపక్షంలో వారిపట్ల అసెంబ్లీలో ప్రస్తావించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తాలూకాలో కేంద్రప్రభుత్వ నరేగా పథకం కింద ఇప్పటివరకు 56శాతం పనులు జరిగాయని, జిల్లాలో మానవ పనిదినాలను అందుకోవడంలో తొలిస్థానంలో ఉండడంతో ప్రగతిదిశగా ఉందని ప్రశంసించారు. రైతులకు మామిడి పంటకు మద్దతు ధర ఇచ్చిందని, రైతుల సంక్షేమందృష్ట్యా అధికారులు కొన్ని నియమాలను సడలించాలని, వారికి ఇబ్బంది కలిగించరాదని సూచించారు. కాగా తాలూకాలో నకిలీ క్లినిక్‌లలో నకిలీ వైద్యులు దర్జాగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని సంబంధితశాఖ అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ గీత, తాలూకా పంచాయతీ పాలనాధికారి టీకే రమేశ్, ఈఓ డాక్టర్ సర్వేశ్, నగరసభ కమిషనర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పంచమశాలి మఠానికి తాళం

» కంటతడిపెట్టిన బసవ మృత్యుంజయ స్వామిజీ



తాళం వేసిన కూడలసంగమలోని పంచమశాలి మఠం

బెంగళూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): కూడలసంగమలోని పంచమశాలి మఠానికి సోమవారం రాత్రి తాళాలు వేశారు. బాగల్కోటెలో మంగళవారం స్వామిజీ ప్రముఖులతో కలసి మీడియాతో మాట్లాడుతూ పంచమశాలిలకు రిజర్వేషన్ సాధించేంతవరకు మఠానికి వచ్చేది లేదని చెప్పానన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్రమంతటా తిరిగి పోరాటం చేశామన్నారు. మఠానికి తాళం వేయడం బాధ కలుగుతోందన్నారు. హునగుంద బసవ మఠానికి వచ్చానని, మఠం ముఖ్యుల తీర్మానమే అంతిమమన్నారు. కూడలసంగమ పంచమశాలి ట్రస్టు అధ్యక్షుడు, ఎమ్మెల్యే విజయానంద కాశప్పనవర్, అనుచరులు మఠం ముందు సీసీటీవీ కెమెరా అమర్చి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయించారన్నారు. బసవ మృత్యుంజయ స్వామితోపాటు ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదుకు సంబంధించి మేనేజర్ చంద్రశేఖర్ చిత్తరగి మాట్లాడుతూ 13న రాత్రి కొందరు మా ఇంటికి వచ్చి తాళాలు ఇవ్వాలని కోరారన్నారు. అందుకు అంగీకరించలేదన్నారు. సోమవారం మెయిన్‌గేట్‌కు తాళం వేశారన్నారు. కాశప్పనవర్ సూచన మేరకే సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మఠానికి తాళాలు వేయడంతో అనుబంధంగా ఉండే విద్యా సంస్థకు సెలవు ప్రకటించారు. ఇదే విషయమై కాశప్పనవర్ మాట్లాడుతూ మఠం మా ఆస్తి అని, ట్రస్టు అధ్యక్షుడిగా రక్షణ కల్పించడం నా బాధ్యత అన్నారు. మఠం ప్రాంగణంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగుతున్నందునే గేట్ ఏర్పాటు చేశామన్నారు.

భూస్వాధీన ఉపసంహరణపై సీపీఎం హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మునివెంకటప్ప

బాగేపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకాలో కేఐఏడీబీ చేపట్టిన భూస్వాధీన ప్రక్రియను ఉపసంహరిస్తూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సీపీఎం హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మునివెంకటప్ప మాట్లాడుతూ భూస్వాధీనాన్ని వ్యతిరేకిస్తూ రైతులు చేపట్టిన సుదీర్ఘకాల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. చన్నరాయపట్టణ హోబళిలోని 13 గ్రామాలలో 1777 ఎకరాలను కేఐఏడీబీ స్వాధీనం చేసుకోదలచిందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ రైతులు చేసిన 1195 రోజుల పోరాటానికి ఫలితం లభించిందని, ఎట్టకేలకు ప్రక్రియను ఉపసంహరించిన రాష్ట్రప్రభుత్వ నిర్ణయానికి ధన్యవాదాలు తెలిపారు. మీడియా సమావేశంలో సీపీఎం నాయకులు చన్నరాయప్ప, రఘురామరెడ్డి, వాల్మీకి, అశ్వత్థప్ప, కృష్ణప్ప, ముస్తఫా తదితరులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.


మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకోండి



చెరువులో మట్టిని తవ్వుతున్న వైనం

బంగారపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): చెరువులో మట్టిను అక్రమంగా తవ్వేస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. తాలూకాలోని బూదికోటె హోబళి ఆలంబాడి జ్యోతనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని ఆలంబాడి చెరువులో ఆదివారం కొంతమంది మట్టిని పొక్లెనర్‌లతో అక్రమంగా తవ్వారు. సాధారణంగా ఉన్నతాధికారులు ఆదివారం అందుబాటులో ఉండరు. ఇదే అదునుగా అక్రమార్కులు ఇలా వ్యవహరిస్తున్నారని కొంతమంది గ్రామస్తులు పేర్కొన్నారు. సుమారు 10-12 అడుగుల లోతు తవ్వి ట్రాక్టర్‌ల ద్వారా తరలించారని మండిపడ్డారు. కొన్ని నెలలక్రితం ఓ స్వచ్ఛంద సంస్థ చెరువులో పూడిక తీసి అభివృద్ధి చేసిందన్నారు. ఇంతలోనే కొంతమంది అధికారుల కన్నుగప్పి వ్యవహరిస్తున్నారన్నారు. గ్రామస్తుడు మంజునాథ్ మాట్లాడుతూ చెరువులో మట్టిని అక్రమంగా ఇష్టం వచ్చినట్టు తవ్వడం ద్వారా చెరువు స్వరూపం మారిపోతుందన్నారు. కాగా పొక్లైనర్, ట్రాక్టర్‌లకు నెంబరు ప్లేట్ లేకుండా రావడం అక్రమాలకు నిదర్శనంగా ఉందన్నారు. మరో గ్రామస్తుడు యల్లప్ప మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైభవంగా సంకష్ట చతుర్థి వేడుకలు



ద్విముఖ గణపతి ఆలయంలో విశేష అలంకరణ

శిడ్లఘట్ట, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసంలో వచ్చిన సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని పట్టణంతోపాటు తాలూకావ్యాప్తంగా పలుచోట్ల ఘనంగా పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. అశోకరోడ్డులోని ద్విముఖ గణపతి ఆలయంలో సోమవారం సుప్రభాతసేవ, అభిషేకం నిర్వహించారు. సాయంత్రం హోమాలు నిర్వహించారు. మహాభిషేకం అనంతరం గరిక తోరణాలు, పుష్పాలతో స్వామివారికి సమర్పించారు. ధూపదీప నైవేద్యాల అనంతరం సంకష్టహర చతుర్థి పాటించే వ్రతకథను భక్తులకు పండిత్ కృష్ణమూర్తి సోదరులు వివరించారు. స్థానిక ప్రముఖుడు నారాయణస్వామి కుటుంబీకులు ప్రత్యేక అలంకరణ చేయించారు. ఇదే రీతిన ఫిలేచర్ క్వార్ట్స్‌లోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ సంకష్టచతుర్థి పూజలు కొనసాగాయి. వీరాపుర గ్రామంలోని మహాగణపతి ఆలయంలోనూ, ఇతర ఆలయాలలోనూ విశేషపూజలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి నూతనశ్రేణి వీ-గార్డ్ ఫ్యాన్లు



ఫ్యాన్లను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు, తదితరులు

బెంగళూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్ విభాగంలో దేశంలోనే అగ్రగామి సంస్థ వీ-గార్డ్ ఇండస్ట్రీస్ మార్కెట్‌లోకి నూతన శ్రేణి ఎయిర్ విజ్ ఫ్యాన్లను లాంచనంగా విడుదల చేసింది. ఈ మేరకు బెంగళూరులో వీ-గార్డ్ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. ఎయిర్‌విజ్ లైట్, ప్రైమ్, ప్లస్, ఎస్‌ల పేరిట నాలుగు మోడల్స్‌ను మార్కెట్ లోకి విడుదల చేసింది. ఆధునిక డిజైన్లతోపాటు విద్యుత్ ఆదా సాధ్యమని వీ-గార్డ్ ఇండస్ట్రీస్ ఎండీ మిథున్ చిట్టిలపిల్లి తెలిపారు. వినియోగ దారుల కోసం విద్యుత్ ఆదాతోపాటు అందమైన ఫ్యాన్లను తీసుకొచ్చామన్నారు. డైరెక్టర్ సీఈఓ రామచంద్రన్ అభిప్రాయం మేరకు స్మార్టర్ టుమారో పేరిట నెక్ట్స్ జనరేషన్ అనేలా సొగసైన డిజైన్, శక్తివంతమైన ఫ్యాన్‌లను విడుదల చేశామన్నారు.

'శక్తి' పథకానికి ప్రజాదరణ



బొమ్మనహళ్ళి సర్కిల్‌లో డ్రైవర్, కండక్టర్లకు సన్మానం

బొమ్మనహళ్ళి, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన నేపథ్యంలో ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నట్టుగా గ్యారెంటీ పథకాలు అమలు చేస్తున్నారని, వీటిలో శక్తి పథకం అత్యంత ప్రజాదరణ పొందిందని బొమ్మనహళ్ళి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రవీంద్ర అభిప్రాయపడ్డారు. గ్యారెంటీ పథకాల కమిటీ బొమ్మనహళ్ళి అధ్యక్షుడు వాసుదేవరెడ్డి సూచనతో బొమ్మనహళ్ళి కూడలిలో మంగళవారం బీఎంటీసీ బస్సు డ్రైవర్, కండక్టర్లకు సన్మానించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ బీఎంటీసీ, కేఎస్ఆర్టీసీ బస్సులలో ఇంతవరకు 500 కోట్లమంది మహిళలు ఉచితంగా ప్రయాణించడం రికార్డుగా నిలిచిందన్నారు. ఇది కాంగ్రెస్‌కు ఒక శక్తి అన్నారు. శక్తి, గృహలక్ష్మి, గృహజ్యోతి పథకాలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వ గొప్పదన్నారు. ప్రభుత్వ పూర్తికాలం గ్యారెంటీ పథకాలు అమలవుతాయన్నారు. ప్రతిపక్ష బీజేపీ ఆరోపణల్లో పస లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ మళ్లీ గెలుస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. గ్యారెంటీ పథకాల ద్వారా మహిళలు సంతోషంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు అశ్వత్థనారాయణ, శ్రీనివాసులు, సయ్యద్ సర్దార్, లోకేశ్‌రెడ్డి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సును ఢీ కొని ఆటో డ్రైవర్ మృతి

చింతామణి, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రహదారి చింతామణి-బెంగళూరు రోడ్డుపై చన్నసంద్ర వద్ద ప్రైవేట్ బస్సును ఆటో ఢీ కొన్న ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. సోమవారం రాత్రి సుమారు 9 గంటలకు ప్రమాదం చోటు చేసుకోగా బెంగళూరుకు చెందిన ఆటో డ్రైవర్ నాగరాజ్ (48) మృతి చెందగా ఆటోలో ఉన్న అతడి పెద్దమ్మ సుగుణ, నాగరాజ్ భార్య ఇందిరాకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ సుగుణను చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం బెంగళూరు ఆసుపత్రికి మార్పు చేశారు. కాగా నాగరాజ్ మృతదేహాన్ని చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మంగళవారం మధ్యాహ్నం పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. చింతామణి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, ఆటోను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మహిళ శవం లభ్యం

బాగేపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పాతపాళ్య హోబళి బిళ్ళూరు సమీపంలోని అడవికొత్తూరు అటవీప్రదేశంలో చెట్టుకు ఉరిసుకున్న స్థితిలో గుర్తు తెలియని మహిళ శవం సోమవారం లభ్యమైంది. సుమారు నాలుగైదు రోజులక్రితం మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని పాతపాళ్య ఎస్సై అన్సర్, చేళూరు సీఐ జనార్ధన్‌లు పరిశీలించారు. మృతురాలికి సుమారు 25 సంవత్సరాలు ఉంటాయని మరింత దర్యాప్తు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న అంబులెన్స్

పరిగి, జూలై 15(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. శ్రీరంగరాజులపల్లికి చెందిన ఓ వృద్ధుడు అనారోగ్యంతో అనంతపురంలో మృతిచెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున పైడేటి బస్టాండు సమీపంలో రోడ్డుపై ఆవులు కట్టారు. డ్రైవర్ హరి వాటిని తప్పించబోయి పక్కనే ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టాడు. విద్యుత్‌వైర్లు తెగి కిందపడ్డాయి. అయితే ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి విద్యుత్‌సరఫరాను ఆపివేసి మరమ్మతుచేసిన అనంతరం విద్యుత్ సరఫరా చేశారు.

నేడు సూర్యఘర్ పథకంపై అవగాహన

హిందూపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సూర్యఘర్ పథకంపై బుధవారం సాయంత్రం 3 గంటలకు జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. కలెక్టర్ హాజరుకానున్నట్లు ట్రాన్స్‌కో రెవెన్యూ, అధికారులు తెలిపారు.

చెరువులకు నీరివ్వాలి

● జలసాధన సమితి నాయకులు

హిందూపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా హిందూపురం మడకశిర చెరువులకు మొదటి ప్రాధాన్యత కింద నీరు ఇవ్వాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురంలోని హంద్రీనీవా ప్రాజెక్ట్ ఎస్ఈ స్వరూప్‌కుమార్‌ను జలసాధన సమితి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా జలసాధన సమితి నాయకులు మాట్లాడుతూ 2018లో హిందూపురం ప్రాంతానికి నీరు వచ్చినప్పటికీ ఏమాత్రం ప్రయోజనంలేకుండా పోయిందన్నారు. పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో 265చెరువులు నింపాల్సి ఉండగా కేవలం కేవలం 40చెరువులలోపే నీరిచ్చారన్నారు. 2022నుంచి 2024వరకు చెరువులకు నీరు వదల్లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని చెరువులకు నీరివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి నాయకులు ఓపీడీఆర్ శ్రీనివాసులు, రాంకుమార్, గంగిరెడ్డి, ప్రకాశ్, నాగరాజు, వీరేంద్ర తదితరులున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్యాధికారి

అమరాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): సీజనల్‌వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం డాక్టర్లకు సూచించారు. మండల పరిధిలోని అమరాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ వివరాలను డాక్టర్లు మనోహర్‌నాయక్, నాగేంద్రనాయక్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సమావేశమై సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మడకశిర రూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ఫైరోజ్‌బేగం తనిఖీ చేశారు. రోగులు, స్టాక్ వివరాల రికార్డులను పరిశీలించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్లను ఆదేశించారు. డాక్టర్లు నారేంద్రనాయక్, నరేష్‌కుమార్ వైద్య సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి, సీడాప్ సంయుక్తాధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్ పాస్/ఫెయిల్ 18-30 సంవత్సరాలలోపు యువతీయువకులు అర్హులన్నారు. మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 9966682246 నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రమాదాలకు నిలయాలు

● కోడూరు తోపు కూడలిలో తరుచూ ప్రమాదాలు ● టెక్స్‌పోర్టు గార్మెంట్స్ వద్ద అదే తంతు

చిలమత్తూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): కోడూరు-పుట్టపర్తి కూడలి, టెక్స్‌పోర్టు గార్మెంట్స్ పరిశ్రమ వద్ద ఉన్న యూటర్న్ ప్రాంతాలు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ఏ ప్రదేశంలో జరుగుతున్నాయో పరిశీలనలు జరిపి నివారణకు చర్యలు చేపట్టడం అధికారుల బాధ్యత. కోడూరు తోపు నుంచి కొడికొండ చెక్‌పోస్టు మధ్యలో రోడ్డు ప్రమాదాలు తరుచూ జరుగుతున్నా నివారణకు చర్యలు తీసుకోకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా ఉంటోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా 44వ జాతీయ రహదారిలో కోడూరు-పుట్టపర్తి కూడలి అత్యంత ప్రమాదకరంగా మారింది. దీంతోపాటు టెక్స్‌పోర్టు గార్మెంట్స్ పరిశ్రమ వద్ద ఉన్న యూటర్న్ వద్ద కూడా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎక్కువగా కోడూరు తోపు నుంచి కొడికొండ చెక్‌పోస్టు వరకు ఆగి ఉన్న వాహనాలకు వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొనడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. సిమెంటు లోడులతో బెంగళూరు వైపు వెళ్లే లారీలు పలు సాంకేతిక కారణాలతో నడి రోడ్డుపైనే ఆగిపోతున్నాయి. ఈ కారణంగా నిలబడిన వాహనాలను సరిగా గుర్తించకపోయి వాటిని వేగంగా వచ్చే వాహనాలు వెనుక నుంచి ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవలే హైదరాబాదు నుంచి బెంగళూరు వెళుతున్న ఓల్వో ప్రైవేటు బస్సు ఆగి వున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. కోడూరు తోపులో కంకర లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ని వెనుకనుంచి అతివేగంగా కంటైనర్ ఢీకొంది. ట్రాక్టర్ నుజ్జునుజ్జయింది. డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఇటీవలే టెక్స్‌పోర్టు గార్మెంట్స్ వద్ద మంచినీటి ట్రాక్టర్ ట్యాంకర్ యూటర్న్ తీసుకుంటుండగా వేగంగా వచ్చే లారీని తప్పించబోయి బోల్తాపడింది. గతంలో ఇక్కడ ప్రమాదాల నివారణకు వేగ నియంత్రణలు ఏర్పాటుచేసినా అవి ఏ మాత్రం ఉపయోగపడలేదు. సిమెంటుతో వెళ్లే లారీలు వేగంతో దూసుకువస్తుంటాయి. ఏమాత్రం పొరపాటు జరిగినా ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. ఇక రోజూ వందల సంఖ్యలో గార్మెంట్స్ పరిశ్రమకు వచ్చే కార్మికులు ఆటోల్లోనే వెళుతుంటారు. వారందరూ కూడళిలో పుట్టపర్తి వైపునకే వెళతారు. దీంతో ఉదయం, సాయంత్రం కూడలి వద్ద చాలా రద్దీ ఉంటుంది. ఇది కూడా ప్రమాదాలకు కారణంగా ఉంటోంది. అధికారులు ఈ ప్రదేశాన్ని ప్రమాదకరమైనదిగా గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడం, సాంకేతిక సమస్యతో రోడ్డుపై ఆగిపోయిన వాహనాలను పక్కకు తరలించడమో చేయాలి. ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు ఉన్నాయి.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.80	1,607.59
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	37,327	16.142
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	25,021	211
నీటి నిల్వ (టీఎంసీలు)	79.13	33.07



పూజలందుకుంటున్న వరసిద్ధి వినాయకుడు

వినాయకుడికి ప్రత్యేక పూజలు

కంప్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగావతి రోడ్డు వరసిద్ధి వినాయకునికి సంకష్ట చతుర్థి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తాదులు పూలు, పండ్లతో మొక్కులు సమర్పించుకున్నారు. ప్రతి సంకష్ట చతుర్థికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపడ్తామని పురోహితులు జగదీష్ తెలిపారు.

ఘనంగా చిన్న మొహర్రం



కొలువైన పీర్లు

సిరుగుప్ప, జూలై 15(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా చిన్నమొహర్రం వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నారు. పండగ సందర్భంగా ఎంతో వైభవంగా భక్తులు పీర్లను ప్రతిష్ఠించారు. పీర్ల దేవుళ్లకు చక్కెర, పూలమాలలతో అలంకరణ చేసి పూజలు చేపట్టారు. పీర్ల దేవుళ్ల చిన్న మొహర్రంను ఎంతో కన్నుల పండువగా జరుపుకున్నారు. రాత్రంతా మేల్కొని అగ్నిగుండంలో నడిచి వెళతారు.



గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ హరిబాబు

ఎస్పీకి ఘన వీడ్కోలు

హోస్పేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు బదిలీ అయిన ఎస్పీ బీఎల్ హరిబాబుకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో మంగళవారం సాయంత్రం తన బాధ్యతలను ఎస్ జాహ్నవికి హరిబాబు అప్పగించారు. జిల్లాలో రెండు సంవత్సరాలుగా శాంతిభద్రతలను కాపాడటానికి ప్రజల జీవితాల్లో శాంతిని నెలకొల్పడానికి ఆయన కృషికి ప్రజల నుంచి అపారమైన ప్రశంసలు పొందారు. బదిలీ అయ్యారని సమాచారం తెలుసుకొని ప్రజలు ఎస్పీ కార్యాలయానికి వందలాది మంది తరలివచ్చారు. ప్రజలు పోలీసులకు భయపడాల్సిన అవసరం లేకుండా ప్రజలకు అనుకూలమైన పోలీసు దళాన్ని సృష్టించారని చెప్పవచ్చు.

బళ్లారి.. కాంగ్రెస్ కంచుకోట

● బీజేపీ ఎత్తులు ఇక్కడ సాగవు: యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మంజునాథ్ గౌడ



మంజునాథ్ గౌడను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

బళ్లారి, జూలై 15(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా కాంగ్రెస్ కంచుకోట అని, దాన్ని ఛేదించడం అసాధ్యమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మంజునాథ్ గౌడ ధీమా వ్యక్తం చేశారు. 2023 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి బళ్లారి జిల్లా నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఘనవిజయం సాధించారని, బీజేపీ ఇక్కడ నామరూపాలు లేకుండా తురుచుపెట్టుకుపోయిందని ఎద్దేవా చేశారు. మంగళవారం యువజన నాయకుడు ముందుగా బళ్లారి రాయల్ సర్కిల్ నుంచి ర్యాలీగా వచ్చారు. అనంతరం దొడ్డనగ గౌడ రంగమందిరంలో కార్యాకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ని కాంగ్రెస్ కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. రంగమందిలో మొక్కకు నీరు పోసి కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. బళ్లారి, విజయనగర ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ కు తిరుగులేదని ధీమా వ్యక్తం చేశారు. బళ్లారి జిల్లా ప్రజలు గతంలో బీజేపీకి అధికారం ఇస్తే దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హమీనీ నెరవేర్చిందని గుర్తు చేశారు. సీఎం, డీసీఎం ఇద్దరూ సమన్వయంతో పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కష్టపడుతున్నారన్నారు. రాజకీయాల్లో యువత పాత్ర కీలకం అన్నారు. యువత పార్టీ పటిష్టతకు శ్రమించాలన్నారు. బళ్లారి యువత ఉత్సాహం చూసి ఆనందంగా ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో కలకం పొంపాపతి, డీ.సీ.సీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఏపీఎంసీ మార్కెట్‌లో సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న బీఎన్‌హెచ్‌ఎస్ సభ్యులు

బళ్లారి సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): పౌరులకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న ప్రజా సమావేశం జరగనున్న నేపథ్యంలో బళ్లారి పౌర పోరాట కమిటీ(బీఎన్‌హెచ్‌ఎస్)లక్ష సంతకాల సేకరణను మంగళవారం చేపట్టింది. ఈ సందర్భంగా కమిటీకి చెందిన సోమశేఖర్‌గౌడ బళ్లారి నగర ప్రజలు కొన్ని నెలలుగా రోడ్లు, తాగునీరు, మురుగునీరు, ఇతర ప్రాథమిక సౌకర్యాలకు సంబందించిన అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. నగరంలో వీధి కుక్కల సమస్య పెరిగిందని, వీటిని నియంత్రించకపోతే సమస్యలు తప్పవన్నారు. సంతకాల సేకరణ సందర్భంగా ఏపీఎంసీ మార్కెట్‌లోని వ్యాపారులు మార్కెట్ మౌలిక సదుపాయాల లోపం , ప్రాంగణంలో పరిశుభ్రత, మురుగునీరు తాగునీటిలో కలవడం వంటి సమస్యలను తెలియజేశారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో పౌరపోరాట కమిటీ సభ్యులు గోవింద్, గురల్లిరాజా, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

హోస్పేట, జూలై15(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ సేవల కోసం ప్రజలు అనవసరంగా తిరగకుండా, సత్వరమే పనులు చేసుకోవడానికి స్పందన ఉపయోగపడుతుందన్నారు. ప్రజాహిత పనుల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, రెవెన్యూ శాఖ, భూసేవలు, జనాభా లెక్కల సేవలు, ఆధార్ సేవలు, సామాజిక భద్రతా సేవలు ప్రజలకు త్వరగా పూర్తయ్యేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ తుకారం

బళ్లారి సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రధాన స్రవంతిలోకి రావాలని ఎంపీ తుకారం పిలుపునిచ్చారు. మంగళవారం కేంద్రప్రభుత్వ గిరిజన వ్యవహారల మంత్రిత్వ శాఖ, జిల్లాపరిపాలన, జిల్లా పంచాయతీ, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ, కేంద్రప్రభుత్వ ప్రధానమంత్రి జనజాతి ఉన్నత గ్రామ్ అభియాన్ కింద పూర్తి ప్రయోజనాల అవగాహన ప్రచారాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో షెడ్యూల్డ్ తెగలు ఎక్కువగా ఉన్న 26 రాష్ట్రాలు, 4కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రంలోని 28జిల్లాలు, 1089 గ్రామాలను ఈ పథకానికి ఎంపిక చేశామన్నారు. వీటిలో బళ్లారి జిల్లాలోని 5 తాలూకాల నుంచి మొత్తం 59గ్రామాలను ప్రధానమంత్రి జనజాతి ఉన్నత్ గ్రామ్ అభియాన్ కింద ఎంపిక చేశారన్నారు. దేశంలో దాదాపు 5.5కోట్ల గిరిజన జనాభా ఉందని. గిరిజన ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి వారి సమగ్ర అభివృద్ధి కోసం ప్రాథమిక సౌకర్యాలు, ఆరోగ్యం, విద్య జీవనోపాధి సౌకర్యాలను అందించడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కేటాయించిన రూ.79.156 కోట్లతో 63,000 గ్రామాల అభివృద్ధి చేస్తామన్నారు. మేయర్ ముల్లంగి నందీశ్, కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్, జిల్లా ఎస్పీ శోభారాణి,షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి రాఘవేంద్ర వర్మ, శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యం గొప్ప వరం: మేయర్

బళ్లారి సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో ఆరోగ్యం చాలా ముఖ్యమైనదని, ఎంత ధనవంతుడైనా ఆరోగ్యం లేకపోతే పేదవారేనని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని మహానగర పాలిక మేయర్ ముల్లంగి నందీశ్ అన్నారు. మంగళవారం జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా నిఘా విభాగం, జిల్లా నాన్-కమ్యూనికేబుల్ డీసీజ్ కంట్రోల్ సెల్ బళ్లారి సహకారంతో నిర్వహించిన 'గృహ ఆరోగ్యపథకం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యం జీవితంలో ఒక గొప్ప వరమని, ప్రభుత్వం గృహ ఆరోగ్య పథకాన్ని అమలు చేయడం పేద ప్రజలకు అత్యంత ప్రయోజనకరమన్నారు. జిల్లాపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ హారీస్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ గృహ ఆరోగ్య పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి జిల్లా తాలూకా , గ్రామ పంచాయితీ స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు.

ఈసందర్భంగా జగ్జీవన్‌రామ్ తోలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ముండ్రగి నాగరాజు మాట్లాడుతూ కోలార్ జిల్లాలో గృహ ఆరోగ్య పథకాన్ని ప్రారంభించినప్పుడు అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. 14 అంటు వ్యాధులను గుర్తించామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, నేటి కాలంలో యువత గుండెపోటుతో బాధపడుతున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు తినే ఆహారం ,వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలన్నారు.

జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి (డీహెచ్ఓ) రమేశ్‌బాబు మాట్లాడుతూ గృహ ఆరోగ్య పథకాన్ని జిల్లా అంతటా విస్తరిస్తున్నామని, ఈ పథకం కింద 14నాన్-కమ్యూనికేబుల్ వ్యాధుల స్క్రీనింగ్ చేపట్టామన్నారు. ప్రైవేట్ ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో ఈ వ్యాధుల చికిత్సకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. నాన్‌కమ్యూనికేబుల్ వ్యాధులను ముందుగానే నివారించడం ముఖ్యమని, ఆరోగ్య శాఖ అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు. అన్ని ఇళ్లలో 30ఏళ్లపైబడిన వారిని పరీక్షించి వారికి తగిన మందులను అందించే పనిని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈపథకం 30ఏళ్ల పైబడిన వారికి మధుమేహం, రక్తపోటు, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రధాన నాన్-కమ్యూనికేబుల్ వ్యాధు ఉచిత స్క్రీనింగ్ నిర్వహణను అందిస్తుందన్నారు. ఆశాకార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి ప్రజలకు నాన్-కమ్యూనికేబుల్ వ్యాదుల గురించి అవగాహన కల్పిస్తారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ద్వారా స్క్రీనింగ్ పనిలో కూడా సహాయం చేస్తారు. రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్న వారికి అక్కడికక్కడే ఉచిత మందులు అందించడానికి హోమ్ హెల్త్ స్కీమ్ కింద ఒక వ్యవస్థను రూపొందించావన్నారు. మధుమేహం, అధికరక్తపోటు, నోటి క్యాన్సర్,రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, డయాబెటిక్, మానసిక ఆరోగ్య రుగ్మతులు, నాడీ సంబందిత రుగ్మతలు, దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి, దీర్ఘకాలిక పల్మనరీ వ్యాధి, నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి, రక్తహీనత కోసం ఆరోగ్య పరీక్షలు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పరీక్షలు చేస్తామన్నారు. ఈసందర్భంగా మహానగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ డి.సుకుమ్, జిల్లా ఇన్‌చార్జ్ కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ హనుమంతప్ప, జిల్లాసర్వేయర్ జిల్లా గృహ ఆరోగ్య ప్రాజెక్టు అమలు అధికారి డాక్టర్ మరియంబి, జిల్లా కుష్టువ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ వీరేంద్ర కుమార్, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నందీశ్



ఏడీసీకి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ సభ్యులు

సంక్షేమ శాఖలో అక్రమాలపై విచారణ జరపండి

● ఏడీసీకి జాయింట్ యాక్షన్ కమిటీ వినతి

బళ్లారి సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున, సంచార అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భూయజమానుల నుంచి అక్రమంగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల జాయింట్ యాక్షన్ కమిటీ మంగళవారం జిల్లాకలెక్టర్‌ను కోరింది. ఏడీసీ మహమ్మద్ జుబేర్‌కు వినతిపత్రం అందజేసిన జాయింట్ కమిటీ నాయకులు శివశంకర్ మాట్లాడుతూ భూమిలేని వారికి భూమిని అందించే ప్రభుత్వ పథకానికి ఆరు సూచించిన అంశాలతో ఫారం-1లో సంబంధిత శాఖ కార్యాలయానికి దరఖాస్తును సమర్పించాలన్నారు. దీని కోసం నోటిఫికేషన్ జారీ చేయాలని, భూ యజమానులకు విస్తృతంగా తెలియజేయడానికి పత్రికా ప్రకటణ చేయాల్సి ఉందాన్నరు. కానీ జిల్లా కలెక్టర్ నుంచి ఆమోదం పొందకుండా , నోటిఫికేషన్ జారీ చేయకుండా సీనియారిటీ ప్రకారం తన కార్యాలయానికి వచ్చిన భూ యజమానుల దరఖాస్తులను నమోదు చేయలేదు. తన శాఖ నుంచి తప్పుడు లేఖలు తయారు చేసి, కొంతమంది మధ్యవర్తులు మాత్రమే తయారు చేసిన లేఖలపై సంతకం చేయడం ద్వారా అతను తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. భూయాజమాన్య పథకం పేద కుటుంబాలకు సహాయం అందించే పథకం, మన జిల్లాలోని 5తాలూకాల్లో ఈ పథకానికి అధికారిక దరఖాస్తులు స్వీకరిస్తున్నందున వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా దళితహక్కుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు శివశంకర్, ఏ.మానయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిజాయతీ తప్పనిసరి

● ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఫరూక్



వైద్యుడు విఘ్నేష్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కంప్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా నిజాయతీగా చేపట్టిన విధులే వారికి గర్తింపునిస్తాయని ఎమ్మిగనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఫరూక్ అన్నారు. ఎమ్మిగనూరు ప్రాథమిక కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న విగ్నేష్ బదిలీ కావడంతో ఆయనకు మంగళవారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అభినందించి సన్మానించారు. విగ్నేష్ మాట్లాడుతూ తమకు అధికారులతో పాటు సిబ్బంది కూడా ఎంతో సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అబ్దుల్ సాదిక్ బసవన్నగౌడ కనకప్ప కృష్ణమూర్తి, పూజ గీతానంద, అశ్విని, ముత్యాలమ్మ, సుమిత్ర, వీరేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ఇనుప చక్రాలతో నడపవద్దు: ఎమ్మెల్యే



మెట్రి వద్ద ఇనుప చక్రాలతో వెళ్తున్న ట్రాక్టర్

కంప్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని రైతన్న నాట్లు సమయంలో రోడ్లపై ఇనుప చక్రాలు నడపరాదని ఎమ్మెల్యే గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. రోడ్ల అభివృద్ధి చెందేందుకు ఎన్నో కష్టాలు ఎదుర్కొని నిధులు మంజూరు చేపడుతున్నామని, కానీ రోడ్ల ఏర్పడిన అనంతరం నాట్లు సమయంలో తమ పొలాల్లో పనుల కోసం ఇళ్ల నుండే పొలం వరకు ఇనుప చక్రాలతో వెళ్లడంతో రహదారులు పాడవుతున్నాయన్నారు. రోడ్లు ధ్వంసమై గుంతలు ఏర్పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. రైతులు రహదారుల నాణ్యతను దృష్టిలో పెట్టుకోవాలన్నారు.

మాజీ మంత్రి తరఫున ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాగేంద్ర అనుచరులు

బళ్లారిరూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని రూపనగుడి గ్రామంలో గత నెలలో రూపనగుడి గ్రామానికి చెందిన గంగ సమాజానికి చెందిన జయన్న చెందిన ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. రైతుకు మాజీమంత్రి నాగేంద్ర అప్తమిత్రుడు గోవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో ఎద్దుల మృతి చెందిన యజమాని కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ. 50 వేలు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రముఖులు నాగరాజు, రాజేష్, వీఎస్ శ్రీనాథ్ గంగప్ప, యర్రిస్వామి, రామాంజినేయులు, శివశంకర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

కామరాజర్‌కు ఘన నివాళి



జ్యోతినగర్ పాఠశాలలో కామరాజర్‌కు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

హోసూరు రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. సీఎంగా విద్యారంగంలో ఆయన చేసిన సంస్కరణలు నేటికీ కొనసాగుతున్నాయి. కామరాజ నాడార్ జయంతిని ప్రస్తుతం విద్యా అభివృద్ధి దినోత్సవంగా ఆచరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలు పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగాయి. కృష్ణగిరి జిల్లా ఉత్తంగరై యూనియన్‌లోని జ్యోతినగర్ మిడిల్‌స్కూల్‌లో కామరాజర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. వకృత్వం, వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్, కథల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ రాజేంద్రన్ పర్యవేక్షించారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..

మాజీ సీఎం, విద్యావేత్త కామరాజర్ జయంతి సందర్భంగా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కామరాజ్ కాలనీలోని కామరాజర్ విగ్రహానికి మంగళవారం నివాళులు అర్పించారు. కామరాజ్ విజయాలను వక్తలు వివరించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజ్, కార్యనిర్వాహకులు భక్తవత్సలం, సెల్వం, ముత్తప్ప, శివకుమార్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ దినేశ్ కుమార్

ఫిర్యాదుల శిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్

హోసూరు రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి తూర్పు యూనియన్‌లో స్టాలిన్ విత్ యు 46 సర్వీస్ ప్రాజెక్ట్‌లో భాగంగా పలు శిబిరాలు నిర్వహించారు. పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన శిబిరాలలో స్థానిక అధికారులు ప్రజల సమస్యలను ఆలకించారు. వివిధశాఖలు అమలు చేస్తున్న పథకాల పనితీరు, ప్రజల ఫిర్యాదులను స్వీకరించారు. కలెక్టర్ దినేశ్‌కుమార్, బరగూరు ఎమ్మెల్యే మథియజగన్, మేయర్ సత్య పాల్గొని పరిశీలించారు.

ఆర్‌వీ పాఠశాలకు తొలి మహిళా ప్రధానోపాధ్యాయురాలు



హెచ్‌ఎం వలర్మతిని స్వాగతిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

హోసూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): హోసూరు ఆర్‌వీ ప్రభుత్వ బాలుర హయ్యర్ సెకండరీ స్కూల్‌కు మహిళా ప్రధానోపాధ్యాయురాలు వలర్మతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కామరాజర్ జయంతిరోజే బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు సెంధిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు శక్తివేల్ తదితరులు పాల్గొన్నారు. తొలి మహిళా హెచ్‌ఎం కావడం మరింత ఉత్కంఠ అనిపించింది. కామరాజర్ జయంతి సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పోటీలు, పలు కార్యక్రమాలు కొనసాగాయి. విజేత విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.

ప్రయాణమంటే నరకయాతనే..!

● మందకొడి పనులతో వాహనదారులకు ఇబ్బందులు

సిరుగుప్ప, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ 150 రహదారిపై ప్రయాణం నరకయాతనగా మారింది. తాలుకాలోని దడేసూగూరు నుంచి టెక్కలకోట మారెమ్మదేవి ఆలయం వరకు ఎన్‌హెచ్ 150కు రూ. 118 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఈ పనులు ప్రారంభమై మూడేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఒక కిలోమీటరు పనులు కూడా జరుగలేదు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన పనులు మందకొడిగా కొనసాగుతున్నాయి. మంత్రి సతీష్ జార్కెహోళి ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు ఆదేశించినా కాంట్రాక్టర్లు పనులు కొనసాగించడం లేదు. ప్రతి రోజు బైకు మోటార్లు, లారీలు, వాహనాలు అధ్వాన్నస్థితికి చేరుకున్న రహదారిలో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురవడంతో రోడ్లపై వర్షపునీరు నిలిచి గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌హెచ్ అధికారులు నిర్లక్ష్యధోరణి వహించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రహదారిపై నిలిచిన వర్షపు నీరు